# ప్రజా మారిటైమ్

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 206 పేజీలు : 04 వెల రూ. 2 మంగళవారం 03 - 02 - 2026




భారత్‌తో మ్యాచ్‌పై పాక్ వెనుకడుగు
రూ. 4,500 కోట్ల వ్యాపారంపై ప్రభావం



2 లో

## అమెరికా నుంచి హైదరాబాద్ చేరుకున్న రేవంత్ రెడ్డి

ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఇతర నేతలు

అమెరికాలో లీడర్ షిప్ కోర్సు పూర్తి చేసిన రేవంత్

20 దేశాల నుంచి వచ్చిన 60 మంది విద్యార్థులతో కలిసి ఆయన ఈ కోర్సును పూర్తి చేశారు

## కేసీఆర్‌ను సిట్ విచారణ కోసం పిలిస్తే తప్పేంటి



- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- నా ఫోన్, నా భర్త ఫోన్లు ట్యాప్ చేశారని అనుమానాలున్నాయి
- సిట్ అధికారులు పిలిస్తే వెళ్లి విచారణకు సహకరిస్తా
- సిట్ విచారణను తప్పుపడుతూ కేటీఆర్ మాట్లాడటం సరైంది కాదన్న కవిత

హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి రెండేళ్లవుతున్నా సిట్ విచారణ ముగింపునకు రావడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విచారణ త్వరగా పూర్తిచేసి దోషులకు శిక్ష పడేలా చూడాలని ఆమె కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కవిత పాల్గొని మాట్లాడారు. సిట్ విచారణలో ఏం జరిగిందో మాజీ సీఎం కేసీఆర్ చెబుతారని భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.సిట్ విచారణను తప్పుపడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ - మిగతా 2 లో

# ఓట్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు

- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు
- గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నిప్పులు చెరిగారు
- 'బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల
- సేవ్ తెలంగాణ, ఓట్ బీజేపీ థీమ్‌తో ఈ ఛార్జ్ షీట్‌ను విడుదల
- రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితుల్లో రేవంత్ ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు




హైదరాబాద్ : రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నిప్పులు చెరిగారు. హైదరాబాద్‌లోని హోటల్ పీపుల్స్ ప్లాజాలో 'బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బూటకపు హామీలు, మోసపూరిత వాగ్దానాలు, - మిగతా 2 లో

# తెలుగు రాష్ట్రాలకు 'గేమ్ ఛేంజర్'గా హైస్పీడ్ రైళ్లు

- కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్
- హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లోనే !
- తెలంగాణ, ఏపీ, తమిళనాడు మధ్య ఆర్థిక,హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందన్న కేంద్రమంత్రి
- అసోం, ఈశాన్య రాష్ట్రాల్లో రూ. 72,468 కోట్లతో రైల్వే ప్రాజెక్టులు
- బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయింపు
- కొత్త రైల్వే ప్రాజెక్టులు, వంతెనల గురించి సర్వే జరుగుతోంది
- భూటాన్‌కు అనుసంధాన ప్రాజెక్టులు చేపడుతున్నాం
- హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయని వెల్లడి



ఢిల్లీ : దేశంలో ఇకపై హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కి.మీ వేగంతో పరుగులు పెడతాయని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. "హైదరాబాద్ నుంచి చెన్నై, పుణె, బెంగళూరుకు 3హైస్పీడ్ రైళ్లు వేస్తాం. దీనితో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో, పుణెకు 1.55 గంటల్లో, చెన్నైకు 2.55 గంటల్లో చేరుకోవచ్చు. హైస్పీడ్ కారిడార్‌తో ఏపీ-తెలంగాణ-తమిళనాడు మధ్య ఆర్థిక, వైద్య, ఆరోగ్య, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందుతాయి. హైస్పీడ్ రైళ్లు తెలుగు రాష్ట్రాలకు గేమ్ ఛేంజర్‌గా మారతాయి" అని వైష్ణవ్ తెలిపారు.అలాగే అసోం, ఈశాన్య రాష్ట్రాల్లో రూ.72,468 కోట్లతో రైల్వే ప్రాజెక్టులు చేపడతామని వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం కొత్త రైల్వే ప్రాజెక్టులు, వంతెనల గురించి సర్వే జరుగుతోందన్నారు. భూటాన్‌కు అనుసంధాన ప్రాజెక్టులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

- మిగతా 2 లో

## శబరిమలలో నిబంధనలు ఉల్లంఘించి సినిమా షూటింగ్!



- శబరిమలలో కొత్తగా రాజుకున్న వివాదం
- నిబంధనలకు విరుద్ధంగా సినిమా షూటింగ్ జరిపిన వైనం
- చిత్రీకరణ నిజమేనని తేల్చిన దేవస్వం విజిలెన్స్ విచారణ
- మకరవిళక్కు రోజున ఆలయ సమీపంలోనే షూటింగ్
- చర్యల కోసం న్యాయసలహా కోరిన ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు

శబరిమల : ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమలలో మరో వివాదం రాజుకుంది. ఇప్పటికే బంగారం చోరీ కేసు ఆరోపణలతో వార్తల్లో ఉన్న ఈ ఆలయంలో, ఇప్పుడు నిబంధనలకు విరుద్ధంగా సినిమా షూటింగ్ జరిపినట్లు దేవస్వం విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. పవిత్ర సన్నిధానం పరిసరాల్లో ఆంక్షలు ఉల్లంఘించి చిత్రీకరణ జరిపినట్లు తేలడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.దేవస్వం విజిలెన్స్ ఎస్పీ సునీల్ కుమార్ సమర్పించిన నివేదిక ప్రకారం, ఒక సినిమా చిత్రీకరణను పంపానది పరిసరాలతో పాటు ఇతర ప్రాంతాల్లో పలు రోజుల పాటు నిర్వహించారు. అత్యంత పవిత్రమైన మకరవిళక్కు రోజున సైతం శబరిమల ఆలయ సముదాయానికి సమీపంలోని ఒక కొండపై చిత్రీకరణ జరిపినట్లు నివేదిక స్పష్టం చేసింది. అయితే, - మిగతా 2 లో



2 లో


## ఒకే పరికరంతో సౌరశక్తి సంగ్రహణ, నిల్వ

- భారత శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ
- భారత శాస్త్రవేత్తల నుంచి కొత్త సౌరశక్తి పరికరం ఆవిష్కరణ
- సౌరశక్తిని సంగ్రహించి, నిల్వ చేసే సింగిల్-యూనిట్ టెక్నాలజీ
- సంప్రదాయ వ్యవస్థలతో పోలిస్తే ఖర్చు, శక్తి నష్టాలు గణనీయంగా తక్కువ
- నికెల్-కోబాల్ట్ ఆక్సైడ్ నానోవైర్లతో తయారైన ఈ పరికరం ఎంతో సమర్థవంతం
- గ్రిడ్ లేని మారుమూల ప్రాంతాల్లో వినియోగానికి అత్యంత అనుకూలం

## ప్రజానాడి




## అందుకే అంబటి వ్యాఖ్యలపై ప్రజలు తిరగబడ్డారు



- రాష్ట్ర గిరిజన, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి
- తిరుమల లడ్డూ కల్తీ అంశాన్ని మళ్లించేందుకే వైసీపీ నేతల బూతులన్న మంత్రి
- లడ్డూ కల్తీపై 11న అసెంబ్లీలో చర్చకు జగన్ రావాలని సవాల్
- ఈడీ ఛార్జ్‌షీట్‌తో చంద్రబాబు నిర్దోషిత్వం రుజువైందని వెల్లడి
- జగన్‌కు మహిళల రక్షణపై మాట్లాడే హక్కు లేదంటూ వ్యాఖ్యలు

అమరావతి : తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే వైసీపీ నేతలు దిగజారుడు భాష, బూతులతో దాడి చేస్తున్నారని రాష్ట్ర గిరిజన, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి - మిగతా 2 లో

# రాష్ట్రంలో హింసను ప్రేరేపించాలని చూస్తోంది

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆ పార్టీ ట్రాప్ లో పడొద్దంటూ పార్టీ నేతలకు సూచన
- వైసీపీపై చంద్రబాబు ఫైర్
- పార్టీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
- అధికారం కోల్పోయామనే అసహనంతో వైఎస్సార్సీపీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజం
- వైఎస్సార్సీపీ ట్రాప్‌లో పడకుండా జాగ్రత్త తీసుకోవాలని సీనియర్ నేతలకు సూచన
- చేసిన పాపాలను దారి మళ్లించాలనేది వైఎస్సార్సీపీ కుట్ర




అమరావతి : అంబటి రాంబాబు, జోగి రమేష్ బూతు మాటలపై టీడీపీ శ్రేణుల నిరసనలు ఉద్రిక్తతకు దారితీసిన నేపథ్యంలో తెలుగుదేశం సీనియర్ నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైఎస్సార్సీపీ కుట్రలు పన్నుతోందని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయామనే అసహనంతో ఆ పార్టీ నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ, వారు చేసిన పాపాల నుంచి పక్కదారి పట్టించాలని చూస్తున్నారని సీఎం దుయ్యబట్టారు. వైఎస్సార్సీపీ ట్రాప్‌లో మనవాళ్లు పడకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. కార్యకర్తలు సంయమనం పాటించేలా సీనియర్ మంత్రులు, నేతలు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.రాష్ట్రానికి ఎక్కువగా పెట్టుబడులను సాధించి అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా అని - మిగతా 2 లో

# సంపాదకీయం

## సైనిక భయంలో జిన్‌పింగ్!

చైనాలో చీమ చిటుక్కుమన్నా పాశ్చాత్యమీడియా ఉలిక్కిపడుతుంది కనుక, చైనా అధ్యక్షుడు ఏకంగా తన సైనికాధిపతిమీదే చర్యలు ప్రకటిస్తే ఇక ఆ కథనాలకు అంతూపొంతూ ఉండదు. ఇటువంటి సందర్భాల్లో తప్పుచేశారు అన్నపదాన్ని వాడితే అవినీతికి పాల్పడ్డారని అర్థమట. దీనితోపాటు, క్రమశిక్షణనూ, చట్టాన్నీ కూడా అతిక్రమించారంటూ దేశ అత్యున్నత మిలటరీ జనరల్‌మీద చైనా రక్షణశాఖ దర్యాప్తు ప్రకటించింది. ఆరంభాన్ని ఇంత ఘనంగా చాటడం ఎందుకు? ఆ దర్యాప్తు ఏదో పూర్తిచేసి, నిజం నిగ్గుతేలిన తరువాతే విషయం చెప్పవచ్చు కదా అన్న ప్రశ్న రావచ్చు. కానీ, చైనాలో ఈ తరహా చర్యలకు చాలా లెక్కలుంటాయి కనుక, సెంట్రల్ మిలటరీ కమిషన్ వైస్ చైర్మన్‌ను జైల్లోకి నెట్టేసిన ఈ పరిణామం మీద పలురకాల విశ్లేషణలు సాగుతున్నాయి. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ జనరల్స్ ఝాంగ్ యౌషియా, లూ జెన్‌లీల అరెస్టు వార్త ప్రపంచ రక్షణరంగ నిపుణులను ఆశ్చర్యంలో ముంచెత్తింది. జిన్‌పింగ్ అధ్యక్షతలోని సెంట్రల్ మిలటరీ కమిషన్ (సీఎంసీ)కు యౌషియా ఉపాధ్యక్షుడు మాత్రమే కాక, సుప్రీంలీడర్‌కు అత్యంత సన్నిహితుడూ విశ్వాసపాత్రుడనీ అంటారు. 2022లో 20వ కమ్యూనిస్టుపార్టీ కాంగ్రెస్ సందర్భంగా ఏడుగురు సభ్యులతో కూడిన సెంట్రల్ మిలటరీ కమిషన్‌కు ఇద్దరు ఉపాధ్యక్షులను, నలుగురుసభ్యులను జిన్‌పింగ్ నియమిస్తే, ఇప్పటికి ఇద్దరు వైస్‌చైర్మన్లు, ముగ్గురు సభ్యులు ఆ పదవులు కోల్పోయారు. జిన్‌పింగ్ సాగిస్తున్న ఈ ప్రక్షాళనలో రక్షణమంత్రికి సైతం రక్షణలేకుండా పోయింది. యౌషియాతో పాటు విచారణ ఎదుర్కొంటున్న లూ జెన్‌లీ పీఎల్‌ఏ జాయింట్ ఆపరేషన్స్ అధినేత, సీఎంసీ సభ్యుడు. రెండేళ్ళలో ఇలా అందరినీ తీసిపారేసిన తరువాత, ప్రస్తుతానికి సీఎంసీలో జిన్‌పింగ్‌తో పాటు సదరు అవినీతి ప్రక్షాళనలో ఆయనకు తోడుగా నిలుస్తున్న మరో ఉన్నతాధికారి మాత్రమే మిగిలారు. 2012లో అధికారంలోకి రాగానే అవినీతి ప్రక్షాళనకు నడుం కట్టిన జిన్‌పింగ్ ఇప్పటివరకూ రెండులక్షలమంది అధికారులమీద చర్యలు తీసుకున్నారట. మంచిదే కానీ, అత్యున్నతస్థాయి సైనికాధికారులను సైతం ఇలా జైళ్ళలోకి నెడితే సైన్యం సమర్థత సన్నగిల్లదా అంటారు కొందరు. 1979లో వియత్నాంతో పోరాడిన అనుభవం ఉన్న యౌషియా వంటి సీనియర్‌లను సైతం శిక్షించడం ద్వారా అత్యంత ఆప్తులను కూడా వదిలిపెట్టబోనని జిన్‌పింగ్ సందేశం ఇవ్వదల్చుకున్నారు. పనిలోపనిగా, ఎటువంటి ప్రశ్నలు, వ్యతిరేకతలకు ఆస్కారం లేకుండా పీఎల్‌ఏను పూర్తిగా తనకు అనుకూలంగా తీర్చిదిద్దుకోవడం కూడా సాధ్యపడుతుంది. చైనాలో పార్టీకీ, ఆర్మీకీ మధ్య ప్రేమలూ పగలూ పక్కపక్కనే ఉంటాయని అంటారు. డెంగ్ కాలంనుంచి అడపాదడపా ఆదేశాలను ధిక్కరించడం, ఆర్మీలో తలెగరేసే వారిని ఓ కంటకనిపెడుతూండటం ఉన్నదే. మొదట్లో పార్టీలో అసమ్మతితో పోరాడిన జిన్‌పింగ్ కూడా తాను సర్వశక్తిసంపన్నుడుగా అవతరించడమే సకల సమస్యలకు పరిష్కారమని నిర్ణయించుకొని, రాజ్యాంగాన్నే సవరించి, ముచ్చటగా మూడోసారి కూడా అధికారంలో కొనసాగుతున్నారు. దేశ అణురహస్యాలను ఝాంగ్ యౌషియా అమెరికాకు అమ్మేశారన్నది ప్రధాన ఆరోపణ. ప్రమోషన్లలో అవినీతి, ఆయుధ కొనుగోళ్ళలో అక్రమాల వంటివి దీనికి అదనం. జిన్‌పింగ్ ప్రభుత్వంపై సైనిక తిరుగుబాటు కథనాలు కూడా వింటున్నాం. తైవాన్‌ను దురాక్రమించుకోవడానికి జిన్‌పింగ్ ఏడాది గడువువిధించారని, యౌషియా అందుకు సానుకూలంగా లేకపోవడంతో పదవి పోగొట్టుకున్నారని అమెరికా మీడియా అంటోంది. గత ఏడాది జూన్ రెండోవారం నుంచి జిన్‌పింగ్ కొంతకాలంపాటు బయటకు కనిపించకపోగానే ఆయన శకం ముగిసినట్టేనని కథనాలు వెలువడ్డాయి. జిన్‌పింగ్ స్థానాన్ని సెంట్రల్ మిలటరీ కమిషన్‌లో ఫస్ట్ వైస్‌చైర్మన్‌గా ఉన్న జనరల్ ఝాంగ్ యౌషియా ఆక్రమించారని, ఆయనకు పార్టీలో సీనియర్లు, 2022 సీపీసీ మహాసభలనుంచి జిన్‌పింగ్ అత్యంత అవమానకరంగా గెంటేసిన మాజీ అధ్యక్షుడు హ్యూజింటావో మద్దతు ఇస్తున్నారని ఆ కథనాలు అన్నాయి. ఇప్పుడు అదే జనరల్ దేశ ద్రోహిగా ముద్రపడ్డాడు. నిజం ఎప్పటికీ వెలుగుచూడదు కానీ, మావో తరువాత అంతటి అత్యున్నతస్థాయి అధికారాలు అనుభవిస్తున్న జిన్‌పింగ్ మరికొంతకాలం అధికారంలో కొనసాగడానికి ఈ విన్యాసాలన్నీ చేస్తున్నారన్న విశ్లేషణలను కాదనలేం. జీవితకాలపు అధ్యక్షుడుగా కొనసాగదల్చుకున్న జిన్‌పింగ్‌కు సదరు కుట్రకథనాలు, అవినీతి ప్రక్షాళన చర్యలు రాజకీయ ప్రత్యర్థులను అడ్డుతొలగించుకొనే అస్త్రాలుగానే కాక, జనంలో సానుకూలత సాధించుకోవడానికి పునాదులుగా ఉపకరించవచ్చు. ఇరాన్ చుట్టూ భారీ యుద్ధనౌకలను మోహరించిన ట్రంప్ అతివేగంగా లక్ష్యాన్ని సాధించాలని అనుకుంటున్నారనీ, దీర్ఘకాలం యుద్ధం కాక, ఓ పెద్ద దెబ్బతో శత్రువును కూల్చి నాయకత్వమార్పిడి కలను నెరవేర్చుకోవాలని అనుకుంటున్నట్టు మీడియా విశ్లేషిస్తోంది. ఇరాన్‌తో వ్యవహారం ట్రంప్ మాటల్లాగా తేలిక కాదని అమెరికా సైనికాధిపతులకు తెలుసు.

## అందుకే అంబటి వ్యాఖ్యలపై ప్రజలు తిరగబడ్డారు

**మొదటిపేజీ తరువాయి –** సంధ్యారాణి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ నేతల విపరీత ధోరణిని ప్రజలు ఇక సహించబోరని, అంబటి రాంబాబు వ్యాఖ్యలపై ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకతే ఇందుకు నిదర్శనమని ఆమె అన్నారు. డైవర్షన్ రాజకీయాలు పక్కనపెట్టి, దమ్ముంటే ఈ నెల 11వ తేదీన ఉదయం 11 గంటలకు అసెంబ్లీలో కల్తీ లడ్డూపై చర్చకు 11 మందితో జగన్ రావాలని ఆమె సవాల్ విసిరారు. గవర్నర్ ప్రసంగం ముగిసిన వెంటనే ఈ చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. హిందూమతంపై కోపంతోనే జగన్ తిరుమల లడ్డూలో రసాయనాలు వాడించి కల్తీ చేయించారని, ఆ పాపం బయటపడటంతో బూతుల భాషతో విషయాన్ని దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. గత ఏడాదిన్నరగా చంద్రబాబుపై వైసీపీ నేతలు చేస్తున్న అవమానాలు, దాడులను చూసి ప్రజలు కడుపుమంటతో రగిలిపోతున్నారని సంధ్యారాణి పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌తో చంద్రబాబు ఏ తప్పు చేయలేదని బట్టబయలైందని, 53 రోజులు అన్యాయంగా జైల్లో పెట్టారని స్పష్టమైందని అన్నారు. 'క్లీన్ చిట్' అంటే ఏంటో చంద్రబాబును చూసి వైసీపీ నేర్చుకోవాలని హితవు పలికారు. ఆస్తి కోసం సొంత తల్లిని, చెల్లిని గెంటేసిన జగన్ ఆడబిడ్డల రక్షణ గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఆమె ఎద్దేవా చేశారు. వైసీపీకి ప్రజాస్వామ్యంపై గౌరవం లేదని, అందుకే అంబటి రాంబాబు లాంటి వారిని బూతులు తిట్టడానికి వదిలారని విమర్శించారు. ఎన్ని డైవర్షన్ రాజకీయాలు చేసినా తిరుమల శ్రీవారికి చేసిన పాపాన్ని ప్రజలు మర్చిపోరని ఆమె వ్యాఖ్యానించారు.

## జోగి రమేశ్ ఇంటిపై దాడి కేసులో 11 మంది టీడీపీ నేతల అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి –** మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై దాడి చేసిన కేసులో 40 మంది టీడీపీ నేతలపై కేసు నమోదయింది. వీరిలో 11 మందిని అరెస్ట్ చేసి, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు తరలించారు. వెంటనే వీరికి స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో... అంతా విడుదల అయ్యారు. నారా లోకేశ్ పై జోగి రమేశ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో... టీడీపీ అభిమానులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఆయన ఇంటిపై దాడి చేశారు. ఇంటిపై రాళ్లు రువ్వారు. పెట్రోల్ బాంబులు విసిరి మంటలు రాజేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారు. టీడీపీ వాళ్లు అయినా సరే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే, 40 మంది నేతలపై కేసులు నమోదు చేశారు.


## శబరిమలలో నిబంధనలు ఉల్లంఘించి సినిమా షూటింగ్!

**మొదటిపేజీ తరువాయి –** సన్నిధానంలో ఎలాంటి షూటింగ్ జరపలేదని చిత్ర దర్శకుడు అనురాజ్ మనోహర్ గతంలో చేసిన వాదనలను ఈ నివేదిక తోసిపుచ్చింది. ఈ ఘటనపై ఇప్పటికే దర్శకుడిపై కేసు నమోదైంది. అయితే, ఆంక్షలు ఉన్న ప్రాంతాల్లో చిత్రీకరణ జరిగినప్పటికీ, దీనికి పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి పొందినట్లు విజిలెన్స్ నివేదికలో ప్రస్తావన లేకపోవడం గమనార్హం. షూటింగ్‌కు సంబంధించిన వీడియో ఆధారాలతో కూడిన ఈ నివేదికను ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) అధ్యక్షుడు కె. జయకుమార్‌కు అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల కోసం బోర్డు న్యాయ నిపుణుల సలహాను కోరింది. చిత్రీకరణ సమయంలో జరిగిన ఉల్లంఘనలను గుర్తించి, సమగ్ర నివేదిక ఇవ్వాలని న్యాయ విభాగాన్ని అధ్యక్షుడు ఆదేశించారు. న్యాయసలహా అందిన తర్వాతే బాధ్యులపై పరిపాలనాపరమైన లేదా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మండల–మకరవిళక్కు యాత్ర సమయంలో భక్తుల రద్దీ, ఆలయ పవిత్రత దృష్ట్యా కఠినమైన నియమాలు అమల్లో ఉండగా ఈ ఘటన జరగడం వివాదాన్ని మరింత పెంచింది.

## అమెరికా నుంచి హైదరాబాద్ చేరుకున్న రేవంత్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి –** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన ముగి ంచుకుని హైదరాబాద్ కు చేరుకు న్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో ఆయన ల్యాండ్ అయ్యారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తో పాటు పలువురు నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పూలమాల వేసి, శాలువాలతో ఘనంగా సన్మాని ంచారు. స్విట్జర్లాండ్ లోని దావోస్ లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో రేవంత్ పాల్గొన్న సంగతి తెలిసిందే. అనంతరం అక్కడి నుంచి అమెరికాకు వెళ్లారు. హార్వర్డ్ యూనివర్సిటీలోని కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్ లో ఆయన లీడర్ షిప్ కోర్సు పూర్తి చేశారు. జనవరి 25 నుంచి 30 వరకు జరిగిన లీడర్ షిప్ ఫర్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ పేరిట నిర్వహించిన తరగతులకు ఆయన హాజరయ్యారు. 20 దేశాల నుంచి వచ్చిన 60 మంది విద్యార్థులతో కలిసి ఆయన ఈ కోర్సును పూర్తి చేశారు. అమెరికాలో కోర్సును పూర్తి చేసుకున్న తర్వాత ఆయన హైదరాబాద్ కు తిరిగి వచ్చారు.

# రాష్ట్రంలో హింసను ప్రేరేపించాలని చూస్తోంది




**మొదటిపేజీ తరువాయి –** సీఎం చంద్రబాబు మంత్రులకు తేల్చి చెప్పారు. దీనిని చెడగొట్టేందుకు వైఎస్సార్సీపీ శతవిధాలా యత్నిస్తోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. తప్పు చేసిన ప్రతీ ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతామని సీఎం హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వైఎస్సార్సీపీ ట్రాప్‌లో పడొద్దని హితవు పలికారు. పార్టీ సిద్ధాంతాలు ప్రజల మేలు కోసమే అనేది క్యాడర్ కు స్పష్టం చేయాలని నేతలను ఆదేశించారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులతో పుట్టిన వైఎస్సార్సీపీ ట్రాప్‌లో పడితే వారికీ మనకూ తేడా ఉండదని సీఎం చంద్రబాబు వివరించారు. పార్టీ సీనియర్ నేతలు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ తదితరులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మన పార్టీ సిద్ధాంతాలు ప్రజల మేలు కోసమే అనేది క్యాడర్‌కు స్పష్టం చేయాలని ఆదేశించారుచేసిన పాపాలు కప్పిపుచ్చుకునేందుకే: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైఎస్సార్సీపీ అడ్డంగా దొరికిపోయిందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆ పార్టీని చీదరించుకుంటున్నారని తెలియజేశారు. చేసిన పాపాలను దారి మళ్లించాలనేది వైఎస్సార్సీపీ కుట్ర అని, పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా అని గుర్తు చేశారు. కానీ అది వైఎస్సార్సీపీ నేతలకు నచ్చడం లేదని, అందుకే అడ్డుకునేందుకు నానావిధాలా కుట్రలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**అదే వైఎస్సార్సీపీ లక్ష్యం :** రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకే వైఎస్సార్సీపీ నేతలంతా బూతు పురాణం ఎత్తుకున్నారని కార్యకర్తల టెలీకాన్ఫ రెన్స్‌లో నేతలు పల్లా శ్రీనివాసరావు, అచ్చెన్నాయుడులు స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైఎస్సార్సీపీ అడ్డంగా బుక్ అయిందని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రజలంతా వైఎస్సార్సీపీని చీదరించుకుంటున్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. లడ్డూ కల్తీ వ్యవహారాన్ని డైవర్ట్ చేయడానికే వైఎస్సార్సీపీ నేతలు బూతులు మాట్లాడుతున్నారన్న నేతలు, వైఎస్సార్సీపీ ట్రాప్‌లో తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు పడకూడదని సూచించారు. గత 20 నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని వివరించారు. అన్ని వర్గాల వారు కూటమి పాలనపై సంతోషంగా ఉన్నారని మంత్రులు తెలిపారు. పెట్టుబడుదారులు పెద్ద ఎత్తున రాష్ట్రానికి వస్తున్నారని వెల్లడించారు. వైఎస్సార్సీపీ నేతలు ఇక చేసేదేమీ లేక బూతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కార్యకర్తలను కావాలనే రెచ్చగొట్టి లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అలజడులు చూసి ఏపీకి ఎవరూ రాకుండా చేయాలన్నది వైఎస్సార్సీపీ నేతల కుట్రని నేతలు దుయ్యబట్టారు. వైఎస్సార్సీపీ కవ్వింపు చర్యల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పల్లా శ్రీనివాసరావు, అచ్చెన్నాయుడులు సూచించారు.

# తెలుగు రాష్ట్రాలకు 'గేమ్ ఛేంజర్'గా హైస్పీడ్ రైళ్లు

**మొదటిపేజీ తరువాయి – అండర్‌గ్రౌండ్ రైల్వే ట్రాక్**

బంగాల్‌లోని సిలిగురి మీదుగా ఈశాన్య ప్రాంతాన్ని భారత్‌తో కలిపే ఈ ఇరుకైన భూభాగాన్ని 'చికెన్స్ నెక్' అని పిలుస్తారు. ఇది భారత్‌కు చాలా వ్యూహాత్మక ప్రాంతం. అందుకే భారత్‌తో ఈశాన్య రాష్ట్రాలను అనుసంధానం చేసేందుకు 40 కి.మీ మేర భూగర్భ రైల్వే ట్రాకుల నిర్మాణానికి కేంద్రం ప్రణాళిక వేసిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇందుకోసం బంగాల్‌లోని 40 కి.మీ వ్యూహాత్మక కారిడార్‌లో భూగర్భ రైల్వే ట్రాకులను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ కారిడార్ ఈశాన్య భారత దేశాన్ని దేశంలోని మిగిలిన ప్రాంతాలతో అనుసంధానిస్తుందని చెప్పారు. "ఈశాన్య రాష్ట్రాలను భారత్ ప్రధాన భూభాగంతో కలిపే 40 కి.మీ వ్యూహాత్మక కారిడార్ కోసం ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయి. అక్కడ భూగర్భ రైల్వే ట్రాక్‌లను నిర్మించడంతో పాటు, ప్రస్తుతం ఉన్న ట్రాక్‌లను నాలుగు లైన్ల మార్గాలుగా మార్చడానికి ప్రణాళికలు సిద్ధం . ఈ ప్రాజెక్టు వివరాలను ఈశాన్య సరిహద్దు రైల్వే (ఎన్ఆర్ఎఫ్) జనరల్ మేనేజర్ చేతన్ కుమార్ శ్రీవాస్తవ చెప్పారు. ఈ భూగర్భమార్గం బంగాల్‌లోని తీన్ మైల్ హాట్, రంగపాణి రైల్వే స్టేషన్ల మధ్య ఉంటుందని ఆయన తెలిపారు. భద్రత దృష్ట్యా ఈ భూగర్భ మార్గం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.

**హైస్పీడ్ రైలు కారిడార్స్ ఇవే**

హైదరాబాద్ సహా ఏడు నగరాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్లను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ఆదివారం ప్రకటించారు. ప్రస్తుతం ముంబయి–అహ్మదాబాద్ మధ్య హైస్పీడ్ రైలు కారిడార్, అనేక రాష్ట్రాలు, జిల్లాలను కలిపే తూర్పు, పశ్చిమ రవాణా కారిడార్ల పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా బంగాల్‌లోని డాంకునీ, గుజరాత్‌లోని సూరత్ మధ్య కొత్త రవాణా కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. అలాగే కొత్త ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు, రానున్న ఐదు సంవత్సరాల్లో 20 జాతీయ జలమార్గాల కార్యాచరణను ప్రతిపాదించారు.

ముంబయి–పుణె
పుణె–హైదరాబాద్
హైదరాబాద్–బెంగళూరు
హైదరాబాద్–చెన్నై
దిల్లీ–వారణాసి
వారణాశి –సిలిగుడి
చెన్నై– బెంగళూరు

'పర్యావరణపరంగా సుస్థిర ప్రయాణికుల వ్యవస్థను ప్రోత్సహించేందుకు ఏడు హైస్పీడ్ రైలుకారిడార్లను అభివృద్ధి



చేయబోతున్నాం. అవి నగరాల మధ్య గ్రోత్ కనెక్టర్లుగా ఉంటాయి. వీటిద్వారా ప్రధాన ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాల మధ్య అనుసంధానం పెరుగుతుంది. ఇవి ప్రయాణ సమయాన్ని కుదిస్తాయని, రోడ్డు మార్గం, ఇప్పటికే ఉన్న రైలు నెట్‌వర్క్‌లో రద్దీని తగ్గిస్తాయి. ఇప్పుడు టైర్–2, టైర్–3 నగరాలపై దృష్టి సారిస్తాం. టెంపుల్ టౌన్లపై కూడా. వాటికి ఆధునిక మౌలిక సదుపాయాలు, కనీస సదుపాయాల కల్పన, వాటి సామర్థ్యాన్ని పెంపునకు వచ్చే ఐదేళ్లలో రూ.5వేల కోట్లు వ్యయం చేసేందుకు ప్రతిపాదిస్తున్నాం. ఛాలెంజింగ్ పద్ధతిలో ఆ ప్రణాళికల అమలు కోసం సంస్కరణ, ఫలితాల ప్రాతిపదికన ఆర్థిక మెకనిజం ఏర్పాటు చేస్తున్నాం' అని నిర్మలా సీతారామన్ తెలిపారు.

# ఒకే పరికరంతో సౌరశక్తి సంగ్రహణ, నిల్వ

**మొదటిపేజీ తరువాయి –** క్లీన్ ఎనర్జీ రంగంలో భారత శాస్త్రవేత్తలు ఒక కీలక మైలురాయిని సాధించారు. సౌరశక్తిని గ్రహించడంతో పాటు దానిని నిల్వ చేయగల పరికరాన్ని (సింగిల్ యూనిట్) అభివృద్ధి చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టీ)కి చెందిన బెంగళూరులోని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మ్యాటర్ సైన్సెస్ పరిశోధకులు ఈ ఘనత సాధించినట్లు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సాధారణంగా సోలార్ సిస్టమ్స్‌లో శక్తిని గ్రహించడానికి, నిల్వ చేయడానికి వేర్వేరు యూనిట్లు అవసరమవుతాయి. దీనివల్ల ఖర్చు పెరగడంతో పాటు శక్తి నష్టం కూడా జరుగుతుంది. అయితే, ఈ కొత్త పరికరంతో ఆ రెండు పనులూ ఒకే యూనిట్‌లో జరిగిపోతాయి. 'ఫోటో–రీఛార్జబుల్ సూపర్ కెపాసిటర్'గా పిలిచే ఈ



పరికరం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా సామర్థ్యం కూడా పెరుగుతుంది. నికెల్–కోబాల్ట్ ఆక్సైడ్ నానోవైర్ల సహాయంతో ఈ పరికరాన్ని అభివృద్ధి చేశారు. ఈ ప్రత్యేక నిర్మాణం వల్ల ఇది సూర్యరశ్మిని గ్రహించడంతో పాటు విద్యుత్‌ను నిల్వ చేసుకునే సూపర్ కెపాసిటర్ ఎలక్ట్రోడ్‌గానూ పనిచేస్తుంది. వాస్తవ పరిస్థితుల్లో పరీక్షించినప్పుడు, ఈ పరికరం 1.2 వోల్టుల స్థిర మైన అవుట్‌పుట్‌ను ఇచ్చింది. 1000 సార్లు ఫోటో–ఛార్జింగ్ చేసిన తర్వాత కూడా 88 శాతం సామర్థ్యాన్ని నిలుపుకుంది. తక్కువ వెలు తురు నుంచి తీవ్రమైన సూర్యరశ్మి వరకు అన్ని పరిస్థితుల్లోనూ ఇది సమర్థంగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ఆవిష్క రణతో పోర్టబుల్, వేరబుల్ పరికరాలతో పాటు విద్యుత్ గ్రిడ్ లేని మారు మూల ప్రాంతాలకు తక్కువ ఖర్చుతో, పర్యావరణహితంగా విద్యుత్‌ను అందించే మార్గం సుగమమైంది. శిలాజ ఇంధనాలు, సంప్రదాయ బ్యాటరీలపై ఆధారపడటాన్ని ఇది గణనీయంగా తగ్గిస్తుంది.

# ఓట్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు

**మొదటిపేజీ తరువాయి –** సేవ్ తెలంగాణ, ఓట్ బీజేపీ థీమ్‌తో ఈ ఛార్జ్ షీట్‌ను విడుదల చేశామన్నారు. గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితుల్లో రేవంత్ ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని.. కానీ నేటికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వేల కోట్ల రూపాయిల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం పూర్తిగా కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ సంపూర్తిగా అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని.. తద్వారా లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. షో పుటప్ తప్ప.. రాష్ట్రంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు లేదంటూ రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఓట్ల కలెక్షన్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు అంటూ ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలకు చేసిందేమిటో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. 7 మున్సిపల్ కార్పొరేషన్లలో టాక్సీల పేరు మీద భారీ కుంభకోణం జరుగుతోందని విమర్శించారు. దీనిలో రూ. 250 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలకు వచ్చే నిధుల్లో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నవేనని గుర్తు చేశారు. రాష్ట్రంలో రహదారులన్నీ అధ్వానంగా మారాయని.. నిత్యం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది మరణిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రైమ్ విపరీతంగా పెరిగిపోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందన్నారు. డ్రగ్స్‌కు కేంద్రంగా తెలంగాణ మారిపోయిందంటూ మండిపడ్డారు. హిందూ దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. చివరకు దేవాలయాల భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. కమిషన్, కాంట్రాక్ట్, కరప్షన్ ప్రభుత్వమని అభివర్ణించారు. ఇది 40 పర్సెంట్ కమిషన్ ప్రభుత్వమని వ్యంగ్యంగా అన్నారు. తమ ఫోన్లు ట్యాపింగ్ చేసి




తమపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ చేయవలసిన అవసరం ఎందుకొచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తొలుత బీజేపీ నేతల ఫోన్లనే ట్యాపింగ్ చేశారని గుర్తు చేశారు. సేవ్ తెలంగాణ.. ఓట్ బీజేపీ నినాదంతో ప్రజల్లోకి వెళ్తా మని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించాలని, గతంలో రెండు పార్టీలకు అవకా శం ఇచ్చారని ఒకసారి బీజేపీకి కూడా అవకాశం ఇవ్వండంటూ టీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు.

# కేసీఆర్‌ను సిట్ విచారణ కోసం పిలిస్తే తప్పేంటి

**మొదటిపేజీ తరువాయి –** కేటీఆర్ మాట్లాడటం సరికాదని, చట్టాలను అందరూ గౌరవించాలని కవిత అన్నారు. చట్టానికి సహకరించాలని పేర్కొన్నారు. గుంట నక్కలతో కలిసి కాంగ్రెస్ పార్టీ డ్రామాలా డుతోందన్న కవిత తన భర్త ఫోన్లు ట్యాప్ చేశారనే అనుమానా లున్నాయని చెప్పారు. సిట్ అధికారులు విచారణకు పిలిస్తే వెళ్లి సహకరిస్తానని స్పష్టం చేశారు. ఇక్కడి ప్రజలను నిర్మల విస్మరించారు : కేంద్రంలోని బీజేపీ తీరు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు ఐఐఎం, నవోదయాలు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఇంకా ఇవ్వట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మెట్రో రైల్ ఫేజ్–2 గురించి బడ్జెట్‌లో ప్రస్తావనే లేదన్న ఆమె తెలుగింటి ఆడబిడ్డ నిర్మల తెలంగాణ ప్రజలను విస్మరించారని మండిపడ్డారు. ఏపీ పునర్విభజన చట్టంలోని అంశాలు 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదని దుయ్యబట్టారు. కొత్త ఎయిర్‌పోర్టులు, ఆర్ఆర్ఆర్‌ను పెండింగ్‌లోనే పెట్టారని ఆక్షేపించారు. రాష్ట్రప్రభుత్వం 47 అంశాల గురించి అడిగితే ఏమీ ఇవ్వలేదని, ఇద్దరు కేంద్రమంత్రులు ఉండి రాష్ట్రానికి ఏమీ తేలేకపోవడం బాధాకరమన్నారు. దేశంలో విద్య, వైద్యానికి 1, 2



శాతమే నిధులు కేటాయించటం దారుణమని కవిత ఆక్షేపించారు. "చట్టానికి ఎవరూ అతీతులు కాదనడానికి మాత్రం మనం ఆలోచన చేసుకోవాలి. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ గారిని పిలిచిన తర్వాత కూడా కేటీఆర్ మాట్లాడుతూ విచారణ పిలవడమే నేరం, ఘోరం అన్నట్లుగా చెబుతున్నారు. ప్రజాజీవితంలో ఉన్నప్పుడు అన్ని పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. అసలు విచారణకే పిలవకూడదన్నట్లుగా మాట్లాడుతున్నారు. అసలు ఈ పరిస్థితి ఇప్పుడు ఎందుకొచ్చింది. ఇన్నీ రోజులు కేసీఆర్‌ను పిలవలేదు కదా విచారణకు. విచారణకు పిలిస్తే వెళ్లక తప్పదు. ఇప్పుడు నన్ను పిలిస్తే కూడా వెళ్తా. చట్టానికి అందరం కూడా సహకరించాలి. అందరం పోతం. వారి ఆలోచనా విధానంలో మార్పు రానంత కాలం బీఆర్ఎస్ పార్టీని మాత్రం ఎవరూ కూడా బాగు చేయలేరు"–కల్వకుంట్ల కవిత, జాగృతి అధ్యక్షురాలు.

**మున్సిపల్‌లో పోటీ చేస్తున్నాం :** తెలంగాణలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలని కవిత ప్రజలను కోరారు. పుర ఎన్నికల్లో జాగృతి నేతలు ఏఐఎఫ్‌బీ గుర్తుతో పోటీ చేస్తున్నారని తెలిపారు. మోదీ బడే భాయ్ అంటూ సీఎం దిల్లీకి 30 సార్లు తిరిగినా రూ.30 కోట్లు కూడా సాధించలేదని విమర్శించారు. గత రెండేళ్లలో అగ్నిప్రమాదాల్లో 22 మంది చనిపోయినా వాటి నివారణకు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కవిత మాట్లాడితే పట్టించుకోం! :** మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లో విలేకరులతో చిట్‌చాట్ నిర్వహించారు. పురపాలక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మంచి ఫలితాలు వస్తాయనే ప్రచారం స్థానికంగానే జరుగుతుందని అన్నారు. చాలా మంది తమ గురించి రకరకాలుగా మాట్లాడుతుంటారని, అన్నింటిపైనా స్పందించాల్సిన అవసరం లేదని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# చిత్తడి నేలల రక్షణపై ధర్మసాగర్‌లో విద్యార్థులకు అవగాహన

## చెరువులు కాపాడితేనే రేపటి జీవనం

## రిటైర్డ్ డి.ఎఫ్.ఓ పురుషోత్తం





**ధర్మసాగర్, ఫిబ్రవరి 02 (ప్రజా మంటలు) :** ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జన విజ్ఞాన వేదిక హన్మకొండ, పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక వరంగల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని జెడ్పి హైస్కూలులో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ డిఎఫ్ఓ పురుషోత్తం హాజరైనారు. చిత్తడి నేలల ప్రాధాన్యం, పర్యావరణ పరిరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ధర్మసాగర్‌లోని సెయింట్ మాథ్యూస్ హైస్కూలులో కూడా పాల్గొని చెరువులు, నీటి వనరుల సంరక్షణ, భవిష్యత్ తరాలకు నీటి భద్రత వంటి అంశాలపై విద్యార్థులను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాలలో పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక జనరల్ సెక్రటరీ టి. శ్రవణ్ కుమార్ తో పాటు ప్రతినిధులు దళపతి, శంకర్ రావు, కుమారస్వామి పాల్గొన్నారు. సెయింట్ మాథ్యూస్ హైస్కూలు నుండి ప్రిన్సిపాల్ షెరిల్ జాయ్, వైస్ ప్రిన్సిపల్ ఆర్. మహేశ్వరి, ఉపాధ్యాయుడు రవికుమార్ పాల్గొన్నారు. జడ్పీ హైస్కూలు నుండి ఇంచార్జి హెడ్‌మాస్టర్ గణేష్, ఉపాధ్యాయులు శ్రీనాథ్, పాల్గునాచారి, స్వర్ణలత హాజరయ్యారు.

# అదనపు ఎస్పీ కి ఎస్పీగా పదోన్నతి: శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




**జగిత్యాల ఫిబ్రవరి 2 ( ప్రజా మంటలు) :** అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి ఎస్పీగా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పి అశోక్ కుమార్ చేతుల మీదుగా పిప్పింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శేషాద్రిని రెడ్డి భుజాలపై స్టార్ చిహ్నాన్ని అలంకరించి అభినందిస్తూ, ఎస్పీగా పదోన్నతి పొందిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.కూకట్ పల్లి &కుత్బుల్లాపూర్ ట్రాఫిక్ డీసీపీగా బదిలీ అయిన సందర్భంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందిచాలని సూచించారు.

# గ్రీవెన్స్ డే సందర్భంగా పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల ఫిబ్రవరి 2 ( ప్రజా మంటలు) :** బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశంప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 7గురు అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

# ముల్కనూర్ సమ్మక్క జాతర హుండీ ఆదాయం రూ.8.67 లక్షలు

## మొత్తాన్ని ఉత్సవ కమిటీకి అందజేసిన ఈవో కిషన్ రావు





**భీమదేవరపల్లి ఫిబ్రవరి 02 (ప్రజా మంటలు) :** మండలం ముల్కనూర్ గ్రామంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం హుండీ కౌంటింగ్ నిర్వహించారు. ఈ కౌంటింగ్‌లో మొత్తం రూ.8,67,296/- ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే నోట్ల రూపంలో రూ.7,25,155, నాణేల రూపంలో రూ.1,29,161, చినిగిన నోట్లుగా రూ.4,000, తడిచిన నోట్లుగా రూ.8,980 లభించాయి. అదనంగా మిశ్రమ వెండి 249 గ్రాములు, మిశ్రమ బంగారం 390 మిల్లీ గ్రాములు కూడా హుండీలో లభించాయి. ఈ హుండీ కౌంటింగ్ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకులు డి. అనిల్, ఉత్సవ కమిటీ సభ్యులు, చైర్మన్, గ్రామ సర్పంచ్, గ్రామ వార్డు సభ్యులు, ప్రజలు, భక్తులు, పూజారులు, శ్రీ రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. లభించిన మొత్తం నగదు, వెండి, బంగారాన్ని అందరి సమక్షంలో ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి మరియు ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కుల ఐలయ్యలకు అప్పగించినట్లు ఈఓ పి. కిషన్ రావు తెలిపారు.

# ముత్తారంలో శివ, పార్వతుల కళ్యాణ మహోత్సవం

## పరిమిత దంపతులకు శివ కళ్యాణంలో పాల్గొనే అవకాశం

## టిటిడిఎస్ చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి




**భీమదేవరపల్లి ఫిబ్రవరి 02 (ప్రజా మంటలు) :** మండలంలోని ముత్తారం గ్రామంలో ఉన్న శ్రీ త్రికూటేశ్వరాలయంలో ఫిబ్రవరి 15 న, శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించ నున్నట్లు ఆలయ టెంపుల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి తెలిపారు. ఈ శివ, పార్వతుల కళ్యాణంలో దంపతులు కూర్చుని పూజల్లో పాల్గొంటే దాంపత్య జీవితంలో ప్రేమ, ఐక్యత పెరగడం, భార్యాభర్తల మధ్య కలహాలు నివారించ బడటం, సంతాన భాగ్యం కలగడం, కుటుంబ సుఖశాంతులు, ఆర్థిక స్థిరత్వం, మంగళదోషం మరియు వివాహ అడ్డంకుల నివారణతో పాటు ఆయురారోగ్యాలు, ఆధ్యాత్మిక శాంతి లభిస్తాయని ఆలయ అర్చకులు చక్రచారి, కోటేశ్వర చారి వివరించారు. ఈ కార్యక్రమానికి పూజా విరాళంగా ₹5,116 నిర్ణయించగా, పరిమితంగా కేవలం ఆరు దంపతులకు మాత్రమే అవకాశం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల భక్తులు ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు.నమోదు వివరాల కోసం చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి (93914 74797, 99893 26427) ను సంప్రదించ వచ్చని తెలిపారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివ, పార్వతుల అనుగ్రహానికి పాత్రులవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# చట్టం ముందు కేసీఆర్ దేవుడా

## భయం ఉంటేనే రాస్తారోకోలు ర్యాలీలు

## జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వీరమల్లు రంజిత్ రెడ్డి తీవ్ర విమర్శలు



**ఎల్కతుర్తి ఫిబ్రవరి 02 ప్రజా మంటలు :** సీట్ విచారణలో భాగంగా ఆదివారం రోజున అధికారులు విచారణకు పిలువగా తప్పు చేయనప్పుడు భయమెందుకు అని వారి అనుచరులు రాస్తారోకోలు బైకు ర్యాలీలు చేయడమేంటని అన్నారు. హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమల్లు రంజిత్ రెడ్డి సోమవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కెసిఆర్ ఏమైనా దైవంశ సంభూతుడ మానవాతీతుడా మహాత్ముడా అని అన్నారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ను చట్టాలకు అతీతుడా గా చూపించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమాల్లు రంజిత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తప్పు చేస్తే ఎంతటి వారైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. సిబుసోరెన్ జయలలిత లాలు ప్రసాద్ యాదవ్ యడ్యూ రప్ప వంటి దేశంలోని ప్రముఖ నాయకులే తప్పులకు జైళ్లకు వెళ్లినప్పుడు దుర్మార్గపు పనులు చేసిన ముఠాకు నాయకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసీఆర్ ను విచారణకు పిలిస్తే ఎందుకు భయపడుతున్నారని ఆయన నిలదీశారు. కెసిఆర్ తప్పు చేయలేదని అనుకుంటే రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు బైక్ ర్యాలీలు పెట్టి ప్రజలను రోడ్డెక్కించడం ఎందుకని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి విభజన అనంతరం కెసిఆర్ ధనిక తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చారని వేలకోట్ల అప్పులు చేసి రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టారని రంజిత్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పుడు ఆ అప్పుల భారం మోస్తూ ప్రజలకు పాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు ప్రజలకు సంక్షేమ పథకాలు విద్య వైద్య రంగాలకు నిధులు కేటాయిస్తూ ముందుకు సాగుతుంటే అభివృద్ధిని జీర్ణించుకోలేని కెసిఆర్ ఆయన అనుచరులు ప్రజా ప్రభుత్వం పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. విచారణ ఎదుర్కొనే ధైర్యం లేకనే ప్రజలను రెచ్చగొట్టే రాజకీయ గ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. కెసిఆర్ పై ఉన్న ఆర్థిక అక్రమాలు అవినీతి ఆరోపణలపై సిబిఐ ఈడి సహా కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమగ్ర విచారణ జరగాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. నిజాలు బయటపడితే కెసిఆర్ పాలనలో జరిగిన దోపిడీ ప్రజల ముందు బయటపడుతుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యం అన్నింటిని గమనిస్తోందని రానున్న మున్సిపాలిటీ ఎన్నికలలో కేసీఆర్ కు తెలంగాణ ప్రజలు మరోసారి రాజకీయ బుద్ధి చెప్పడం ఖాయమని జోస్యం చెప్పారు. చట్టాన్ని తప్పించుకోవాలని ఎంత ప్రయత్నించినా చివరికి న్యాయం గెలుస్తుందని కేసీఆర్ అయినా సరే చట్టం ముందు తలవంచక తప్పదని వీరమల్లు రంజీత్ రెడ్డి స్పష్టం చేశారు.

# మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



**జగిత్యాల ఫిబ్రవరి 2 (ప్రజా మంటలు) :** మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుండి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికలో ఎక్స్ ఆఫీషియో సభ్యులు ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.జగిత్యాల కలెక్టరేట్ నుండి జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, ఎక్కడ చిన్నపాటి లోపాలకు కూడా అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. పరోక్ష విధానం ద్వారా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు, రాజ్య సభ సభ్యులు ఎక్స్ అఫిషియో హోదాలో ఏదో ఒక మున్సిపాలిటీని ఎంచుకొని ఆప్షన్ ఇచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు.సెక్షన్ 5, 20 ప్రకారం ఎవరైనా ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్సీలు తాము ఎన్నికైన 30 రోజుల్లోపు ఏదో ఒక మున్సిపాలిటీకి ప్రాతినిధ్యం వహించేందుకు ఆప్షన్ ఇచ్చి ఉండాలని, అలా కాకుండా ఇంతవరకు ఆప్షన్ ఇవ్వని పక్షంలో నిబంధన ప్రకారం మున్సిపల్ ఎన్నికలు అయిన 30 రోజుల్లో ఆప్షన్ ను సంబంధిత మున్సిపల్ కమిషనర్ కు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దీనికొరకు ఫిబ్రవరి, 11 నుండి 14వ తేదీ లోపు నోటీస్ జారి చేసి ప్రజాప్రతినిధుల నుండి ఆప్షన్ తీసుకోవాలని సూచించారు.జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలోని 5 మున్సిపాలిటీలకు సంబంధించి రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.ఎన్నికల షెడ్యూల్ ప్రకారం తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సమయాల్లో ఎన్నికల నిబంధనల మేరకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని అందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

# అంగరంగ వైభవంగా బుగ్గారం పోచమ్మల జాతర రథోత్సవం

## తండోప తండాలుగా తరలివచ్చిన భక్తజనం





**బుగ్గారం / గొల్లపల్లి ఫిబ్రవరి 02 (ప్రజా మంటలు):** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో సోమవారం శ్రీ ముత్యాల పోచమ్మ నల్ల పోచమ్మల జాతర, రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వివిధ జిల్లాలతో పాటు అంతర్రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తజనం తండోప తండాలుగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.ఆలయ కమిటీ చైర్మన్ మసర్తి నర్సయ్య ఆధ్వర్యంలో జాతరకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. దావతోళ్ల విన్యాసాలు, ఒగ్గు కళాకారుల ప్రదర్శనలు, డప్పు కళాకారుల నృత్యాలు, ఇతర కళాప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఆలయ కమిటీ చైర్మన్ మసర్తి నర్సయ్య తనయుడు నరేష్ దంపతులు ప్రత్యేకంగా వండిన బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి శ్రీ ముత్యాల పోచమ్మ నల్ల పోచమ్మలకు నైవేద్యంగా సమర్పించారు. దావతోళ్లు రంగురంగుల పిండితో వేసిన ముగ్గులు (పట్టు), అన్నంతో ఏర్పాటు చేసిన దిష్టి కుంభం, ప్రకృతి పూలతో అలంకరించిన రథం భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తమ మొక్కలు తీర్చుకుని, కట్న కానుకలు సమర్పిస్తూ భక్తిని చాటుకున్నారు. భక్తులు, మహిళలు స్వయంగా అమ్మవార్ల రథాన్ని లాగి తమ భక్తిశ్రద్ధలను వ్యక్తం చేశారు.ధర్మపురి సీఐ ఎ. రామ్ నరసింహా రెడ్డి ఆదేశాల మేరకు, బుగ్గారం ఎస్సై జి. సతీష్ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బలగాలు బందోబస్తు నిర్వహించాయి. భక్తుల వాహనాలను ప్రత్యేక స్థలాల్లో పార్కింగ్ చేయించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ధర్మపురి సీఐ ఎ. రామ్ నరసింహా రెడ్డి స్వయంగా జాతరకు హాజరై ఏర్పాట్లను పర్యవేక్షించారు.హమాలి సంఘం సభ్యులు, ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు ప్రత్యేక కృషి సలిపి ఉచిత సేవలు అందించారు. శుభ్రతతో రుచికరమైన వంటకాలు సిద్ధం చేసి కూరగాయల భోజనాలతో అన్నదానం ఘనంగా నిర్వహించారు.ఈ జాతరలో గ్రామ సర్పంచ్ నక్క రాజవ్వ రాజయ్య, ఉపసర్పంచ్ జంగ లావణ్య శ్రీనివాస్, పాలకవర్గం వార్డు సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, కాంగ్రెస్, టీడీపీ, డీఎస్పీ మండల పార్టీల అధ్యక్షులు వేముల సుభాష్, పెద్దనవేని రాగన్న, దూడ పోచ రాజయ్య, మాజీ సర్పంచ్‌లు మసర్తి రాజారెడ్డి, లక్ష్మి, మూల సుమలత శ్రీనివాస్, నాయకులు శంకర్, రాజన్న, సత్తన్న, మల్లయ్య, మల్లేశం, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు. వేలాదిమంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని జాతరలో భాగస్వాములయ్యారు.

# మొదటిరోజు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతం



**జగిత్యాల ఫిబ్రవరి 2 ( ప్రజా మంటలు) :** జిల్లాలో ఈరోజు నుండి 17 (జనరల్ మరియు ఒకేషనల్) పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల్లో భాగంగా ఈరోజు జరిగిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ రోజు జరిగిన ప్రాక్టికల్ పరీక్షలలో ఉదయం 1409 మంది విద్యార్థులకు గాను 1312 మంది విద్యార్థులు హాజరైనారు ఇందులో జనరల్ విభాగంలో 808 మంది విద్యార్థులకు గాను 780 మంది విద్యార్థులు అదేవిధంగా ఒకేషనల్ విభాగంలో 601 మంది విద్యార్థులకు గాను 532 మంది విద్యార్థులు హాజరైనారు మరియు మధ్యాహ్న సమయంలో మొత్తం 1119 మంది విద్యార్థులకు 1070 మంది విద్యార్థులు హాజరైనారు. ఇందులో జనరల్ విభాగంలో 603 మంది విద్యార్థులకు గాను 600 మంది అదేవిధంగా ఒకేషనల్ విభాగంలో 516 మంది విద్యార్థులకు గాను 470 మంది విద్యార్థులు హాజరైనారు. ఇదేవిధంగా ప్రతిరోజు ఎలాంటి అవాంతరాలు లేకుండా పరీక్షలు నిర్వహించాలని సంబంధిత పరీక్ష సెంటర్ల సూపరింటెండెంట్ లకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బి.నారాయణ ఆదేశించడమైనది.

# సీపీఆర్ విధిగా అంతా నేర్చుకోవాలి..

## గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిరా

## సికింద్రాబాద్‌లో ఉచిత సిపిఆర్ శిక్షణ శిబిరం




**సికింద్రాబాద్, ఫిబ్రవరి 02 (ప్రజామంటలు):** అత్యవసర పరిస్థితుల్లో ఇతరుల ప్రాణాలను కాపాడే సీపీఆర్ ను ప్రతి ఒక్కరు విధిగా నేర్చుకోవాలని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.ఇందిరా సూచించారు. గాంధీ మెడికల్ కాలేజీ ఆలుమ్ని అసోసియేషన్, గ్లోబల్ అలయెన్స్, జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉచిత సిపిఆర్ శిక్షణ శిబిరం సోమవారం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. ఇందిర ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చిన వ్యక్తికి తక్షణమే సిపిఆర్ చేయడం ద్వారా మెరుగైన వైద్యం అందించే వరకు ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉచితంగా ప్రజలకు సిపిఆర్ శిక్షణ అందించడం ద్వారా ఒకరి ప్రాణాన్ని కాపాడడమే కాకుండా వారి కుటుంబానికి కూడా సహాయం చేసినవారమవుతామని పేర్కొన్నారు. ఈ తరహా శిక్షణ శిబిరాలను విస్తృతంగా నిర్వహించాలని నిర్వాహకులను ఆమె అభినందించారు.రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ శిబిరంలో ఐదు వేల మందికి పైగా ఉచితంగా సిపిఆర్ శిక్షణ అందించారు. ప్రజల్లో అవగాహన పెంచే దిశగా ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గాంధీ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, ఆలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ లింగమూర్తి, డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ కే. రాజశేఖర్, డా.నాగార్జున చక్రవర్తి, డాక్టర్ చైతన్య, డాక్టర్ లక్ష్మీనారాయణ, డా. డెన్నిస్ మెకాలే, డా. రాజేష్, డా.అనిత, డా. రోహిత్, మెప్మా ఇంచార్జి డాక్టర్ సుజాత,జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు నరసింహమూర్తి, కృష్ణారెడ్డి, శ్రీధర్, వెంకట్, శ్రీదేవి, నందకుమార్, వసుమతి, రామేశ్వర్, నర్సింగ్ రావు పాల్గొన్నారుద

# హుస్నాబాద్ పట్టణాన్ని రాష్ట్రానికి రోల్‌మోడల్‌గా అభివృద్ధి చేస్తా !

## హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్, ఫిబ్రవరి 2 (ప్రజా మంటలు):** ఈనెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో హుస్నాబాద్‌లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. అవకాశం ఇస్తే హుస్నాబాద్ పట్టణాన్ని ప్రత్యేక ప్రణాళికతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికి రోల్‌మోడల్‌గా మారుస్తామని ఆయన హామీ ఇచ్చారు.గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఒక్క సంవత్సరంలోనే హుస్నాబాద్‌లో 500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 1, 2, 3, 12, 13, 14 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులతో కలిసి ఆయన డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. ప్రజలను ఆత్మీయంగా కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ఈ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనూష సాగర్, లత కృష్ణస్వామి, కొండ రజిత, కేశినేని రమేష్, పచ్చిమట్ల శ్రీకాంత్, దండి లక్ష్మి అభ్యర్థులుగా ఉన్నారని ఓటర్లకు పరిచయం చేశారు.పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, మహిళలకు వడ్డీలేని రుణాలు వంటి పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. హుస్నాబాద్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు, 250 పడకల ఆసుపత్రి నిర్మాణం, ఇంజినీరింగ్ కళాశాల, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.ఉపాధి అవకాశాల కోసం ఇండస్ట్రియల్ కారిడార్, మహిళల స్వయం ఉపాధికి సెట్విన్ శిక్షణ, ఎల్లమ్మ చెరువు వద్ద ఫిషరీస్ మార్కెట్, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 20 స్థానాలు గెలిపించి మరింత బలం ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై హక్కుల కమీషన్ లో ఫిర్యాదు



**హైదరాబాద్, ఫిబ్రవరి 02 (ప్రజా మంటలు):** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం (ఖురా) మతాన్ని లక్ష్యంగా చేసుకొని ఎటువంటి ప్రేరణ లేకుండా ద్వేషపూరితంగా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ వైస్ చైర్మన్ & ప్రెసిడెంట్ మొహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ ఫిర్యాదు దాఖలు చేశారు.ఈ ఫిర్యాదును తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు (జుడిషియల్) శివాడి ప్రవీణ పరిశీలించి, నం. 329/2026గా నమోదు చేశారు. ఈ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నుండి 20.02.2026లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

# భాగ్యనగరంపై 'సీత' కన్ను

పద్దు ప్రసంగంలో ఎక్కడా వినిపించని హైదరాబాద్ - మరి నిధులెలా?

అభివృద్ధి పనులకు దాదాపు రూ.1 లక్ష కోట్లకు పైగా నిధులు అవసరం

ఎన్నిసార్లు కేంద్రానికి లేఖ రాసినా దక్కని ఫలితం

తెలంగాణ ప్రాజెక్టులకు నిధులు ఇక్కడ నుంచి వస్తాయి?




కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నగరానికి నిరాశే ఎదురైంది. మహానగరం రూపు రేఖలు మార్చే కీలక ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.1 లక్ష కోట్ల ప్రాజెక్టుల ప్రతిపాదనలు పంపగా, వాటిలో ఏ ఒక్క దానికి కూడా భరోసా ఇవ్వలేదు. ఒక్క హైస్పీడ్ రైల్ కారిడార్ల అంశంలో తప్ప, ఆ గంటన్నర ప్రసంగంలో మరెక్కడా హైదరాబాద్ పేరు కనిపించలేదు, వినిపించ లేదు.

**రూ.1 లక్ష కోట్లకు పైగా నిధులు అవసరం :** మూసీ పునరుజ్జీవ కార్యక్రమం, ప్రాంతీయ వలయ రహదారి (ఆర్‌ఆర్‌ఆర్), మెట్రో రెండో దశ ప్రాజెక్టు, తదితర ప్రాజెక్టులు హైదరాబాద్ అభివృద్ధికి చాలా కీలకమైనవి. కానీ వాటిని పూర్తి చేయడానికి రూ.1 లక్ష కోట్లకు పైగా నిధులు అవసరం. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరుతూ ఎన్నోసార్లు కేంద్రానికి లేఖ రాసిందని, వాటి ప్రస్తావన లేకుండానే బడ్జెట్ రూపుదిద్దుకోవడం నిరాశకు గురి చేసిందని ప్రభుత్వ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కేంద్ర పద్దులో మౌలిక సౌకర్యాలకు పెద్దపీట వేసినప్పటికీ రాష్ట్రానికి ప్రయోజనం కలిగే ప్రకటనలు లేవని నిపుణులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ, ఆర్‌ఆర్‌ఆర్, గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్లు తదితర ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని పలు సంస్థల అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**మూసీకి మద్దతు తప్పనిసరి :** ఈ మహానగరంలో ఉన్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును పూర్తి చేయడం చాలా అత్యవసరం. కేంద్ర ప్రభుత్వ సిఫార్సులో మొదటి దశ పనులకు రూ.4 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు ఇప్పటికే ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) ప్రాథమికంగా అంగీకారం తెలిపినప్పటికీ, మిగిలిన దశలు పూర్తవ్వాలంటే కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాల్సిందే.

**పన్ను మినహాయింపుతో పెరుగుతున్న డిమాండ్ :** బడ్జెట్‌లో డేటా సెంటర్లకు ప్రకటించిన పన్ను రాయితీలతో నగరానికి మరిన్ని కేంద్రాలు వచ్చే అవకాశముందని నిర్మాణ సంస్థల అంచనా. హైదరాబాద్‌లో ఇప్పటికే అమెజాన్ వెబ్ సర్వీసెస్, మైక్రోసాఫ్ట్ అజూర్ తదితర సంస్థలు డేటా సెంటర్లను కల్గి ఉన్నాయి. టాక్స్ మినహాయింపుతో ఈ రంగంలో పెట్టుబడుల రాకతో ఉపాధి అవకాశాలతో పాటు గృహాలకు డిమాండ్ పెరుగుతుందని జీహెచ్‌ఆర్ ఇన్‌ఫ్రా సీఈవో కార్తీష్‌రెడ్డి తెలిపారు.

**హైదరాబాద్‌లో గ్లోబల్ మెడికల్ హబ్ :** వైద్య పర్యాటకానికి ఊతమిచ్చేలా దేశంలో ఐదు ప్రధాన ప్రాంతీయ వైద్య కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్రాలకు దోహదపడేలా కేంద్రం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. అంతర్జాతీయ స్థాయి వైద్య సదుపాయాలకు కీలకంగా ఉన్న హైదరాబాద్‌ను ఇటీవల చేసిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే గ్లోబల్ మెడికల్ హబ్‌గా మారేందుకు దోహదపడనున్నాయి. ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే ఈ హబ్‌లలో హైదరాబాద్‌కు అవకాశం ఉంటుందనే అభిప్రాయాన్ని వైద్య నిపుణులు వ్యక్తం చేస్తున్నాయి.

**మెట్రో విస్తరణ, ముందుకు సాగేనా :** మెట్రో రెండోదశ విస్తరణకు బడ్జెట్‌లో నిధులు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం భావించినా బడ్జెట్‌లో నిధులే లేవు. తొలి దశలో సర్దుబాటు ఖర్చు నిధి రూ.1200 కోట్లు మినహా కేంద్రం నుంచి దక్కిన నిధుల్లేవు. రెండో దశలో కేంద్ర, రాష్ట్ర సంయుక్త ప్రాజెక్ట్‌గా రూపకల్పన చేశారు. కేంద్రానికి పంపించిన డీపీఆర్‌ల ప్రకారం రెండు భాగాలు కలిపి 152.5 కి.మీ.గానూ రూ.43,848 కోట్లు వ్యయం అవుందని అంచనా వేశారు. ఇందులో కేంద్రం వాటా 10 శాతం ఉంది. బడ్జెట్‌లో దీని గురించే ఎత్తలేదు. దిల్లీ, బెంగళూరు అండగా ఉండాలని రాష్ట్రం కోరుతోంది.

# రాష్ట్రంలో అరుదైన ఖనిజాల వెలికితీతకు కేంద్రం తోడ్పాటు

ఖనిజాల తవ్వకాలకు కేంద్రం పెద్ద ఎత్తున ప్రోత్సాహం

ఏపీ సహా ఒడిశా, తమిళనాడు, కేరళలతో కలిపి కారిడార్ల ఏర్పాటు

పెట్టుబడుల రాకతో పెరగనున్న ఉపాధి అవకాశాలు



ఏపీలోని కేవలం సముద్ర తీరాల్లో కొన్నిచోట్ల మాత్రమే లభించే బీచ్‌శాండ్ వంటి అరుదైన ఖనిజాల తవ్వకాలు, వాటి శుద్ధి తదితరాల్లో కీలక అధ్యాయానికి తెరలేచింది. వాటి తవ్వకాలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించనున్నట్లు కేంద్రం ప్రకటించడంతో రాష్ట్రంలో మైనింగ్ రంగంలో భారీ ఎత్తున పెట్టుబడులు రానున్నాయి.అరుదైన ఖనిజాలు అధికంగా లభించే రాష్ట్రాలైన ఏపీ సహా ఒడిశా, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో కలిపి రేర్ ఎర్త్ కారిడార్ల ఏర్పాటుకు సహకారం అందించేందుకు కేంద్రం ముందుకొచ్చింది. దీనివల్ల వీటి తవ్వకాలకు అనేక ఔత్సాహిక కంపెనీలన్నీ ముందుకొస్తాయి. మైనింగ్ యాక్టివిటీ భారీగా పెరుగుతుంది. తద్వారా అధిక సంఖ్యలో యువతకు ఉపాధి అవకాశాలు సైతం పెరుగుతాయి. ప్రభుత్వానికి రాబడి కూడా గణనీయంగా పెరగనుంది.211 మిలియన్ టన్నుల నిల్వలు: శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు సముద్ర తీరప్రాంతంలో దాదాపు 16,600 హెక్టార్ల పరిధిలో 211 మిలియన్ టన్నుల బీచ్‌శాండ్ నిల్వలున్నాయని ప్రాథమికంగా ఓ అంచనా ఉంది. వీటిలో మోనజైట్, ఇలిమినైట్, రూటైల్, గార్నెట్, సిలిమనైట్, జిర్కాన్ వంటి అరుదైన ఖనిజాలు లభిస్తాయి. ఇలిమినైట్, రూటైల్ నుంచి టైటానియం ముడి ఖనిజ మెటీరియల్ వస్తుంది. దానిని శుద్ధిచేస్తే టైటానియం ఆక్సైడ్ పిగ్మెంట్లు వస్తాయి. మోనజైట్‌లో రేడియో ధార్మికత కలిగిన థోరియం కంటెంట్ ఉంటుంది. దీని నుంచి భూఅయస్కాంత ఖనిజాలు లభిస్తాయి.ప్రైవేటు సంస్థలకు భాగస్వామ్య అవకాశం: ఎలక్ట్రానిక్ వస్తువులు, సెన్సర్లు, రాకెట్లు తదితరాల్లో భూఅయస్కాంత ఖనిజాన్ని వినియోగిస్తారు. బీచ్‌శాండ్ తవ్వకాలను జరిపి, వాటి నుంచి ఆయా ఖనిజాలను వేరుచేసి, శుద్ధిచేసి విలువ జోడించే ప్రక్రియను చేపట్టడం ఎంతో ఖర్చుతో కూడుకున్నది. అరుదైన ఖనిజాలు లభించే లీజులను కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలకు మాత్రమే కేటాయిస్తారు. ఆ సంస్థలతో కలిసి ఔత్సాహిక ప్రైవేటు సంస్థలు కూడా ఇందులో పెట్టుబడులు పెట్టి, ఖనిజ తవ్వకాలు, శుద్ధి వంటి వాటిలో భాగస్వామ్యం అయ్యేందుకు అవకాశం అనేది ఏర్పడుతుంది.ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని 909.85 హెక్టార్లలో రెండు లీజులు, విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో 90.15 హెక్టార్లలో ఒక లీజు కలిపి మొత్తం వెయ్యి హెక్టార్లలో మూడు లీజులు ఏపీఎండీసీకి గతంలో కేంద్రం మంజూరు చేసింది. ఇందులో ఏపీఎండీసీతో కలిసి అదానీ గ్రూప్‌నకు చెందిన అల్లువియల్ హెవీ మినరల్స్ లిమిటెడ్ సంస్థ ఖనిజ తవ్వకాలు, సెపరేషన్, ప్రాసెసింగ్ వంటి ప్రక్రియకు మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్‌గా ఎంపికైంది. త్వరలో దీనికి సంబంధించిన తవ్వకాలను ఆరంభించనుంది. ఇకపై మిగిలిన బ్లాక్‌ల్లో సైతం లీజులను పొంది, తవ్వకాలను చేపట్టే ప్రక్రియ మరింత వేగవంతం కానుంది.ఏజెన్సీ ప్రాంతాల్లోనూ అరుదైన ఖనిజాలు: శ్రీకాకుళం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వరకు ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లోనూ అరుదైన ఖనిజాలు ఉన్నాయి. విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో బాక్సైట్ నిల్వలు ఉన్నాయి. ఇదే ప్రాంతాల్లో గ్రాఫైట్ నిల్వలు సైతం ఉన్నాయి. ఇందులో క్రిప్టాన్, జెనాన్, రెడాన్ వంటి అరుదైన ఖనిజాలు లభిస్తాయి. గ్రాఫైట్‌ను బ్యాటరీల తయారీలోనూ వినియోగిస్తారు. వీటికి స్థిరత్వం ఎక్కువగా ఉంటుంది. న్యూట్రల్ మినరల్స్‌గా కూడా వీటిని పిలుస్తారు. ఏజెన్సీలోని గ్రాఫైట్ కోసం ప్రస్తుతం అన్వేషణ జరుగుతోంది. నిల్వలు కనుగొన్నాక వాటిలో తవ్వకాలు, ప్రాసెసింగ్‌కు కేంద్రం ఏర్పాటు చేసిన రేర్ ఎర్త్ కారిడార్లు ఎంతగానో దోహదం చేస్తాయి.ముఖ్యంగా అనంతపురం, కర్నూలు, చిత్తూరు తదితర జిల్లాల పరిధిలో బంగారం ఖనిజ నిల్వలు ఉన్నాయి. వాటిలో తవ్వకాలను నిర్వహిస్తే బంగారంతో పాటు బెనడియం, గాలియం వంటి ఖనిజాలు బయటకు వస్తాయి. ఇకపై ఇటువంటి ఖనిజాల తవ్వకాలకు ముందుకొచ్చే ఔత్సాహిక కంపెనీలకు కేంద్రం నుంచి మరింత ప్రోత్సాహం అందనుంది.

# తెలంగాణలో 500 కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు!

రూ.3,200 కోట్లు కేటాయింపు

దేశవ్యాప్తంగా రానున్న ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు

ఈ ప్రత్యేక ల్యాబ్‌ల కోసం రూ.3,200 కోట్లు కేటాయింపు

ప్రతి జిల్లాల్లో ఒక గర్ల్స్ హాస్టల్ నిర్మాస్తామని కేంద్రం ప్రకటన



ఈసారి నుంచి పాఠశాలల్లో కొత్తగా యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ అండ్ కామిక్స్ (ఏవీజీసీ) కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు రానున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం 15 వేల ప్రభుత్వ పాఠశాలలు, 500 కళాశాలల్లో వీటిని ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. ఇక తెలంగాణ రాష్ట్రం విషయానికొస్తే కనీసం 500 వరకు ఈ ల్యాబ్‌లు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీన్ని ముఖ్య ఉద్దేశం పాఠశాల విద్యార్థుల్లో రోబోటిక్స్, 3డీ ప్రింటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లపై అవగాహన పెంచేందుకు 2016లో అటల్ ఇన్నోవేషన్ మిషన్ మొదలైంది.

**30 వేల ల్యాబ్‌లు ఏర్పాటు :** దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 10 వేల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు (ఏటీఎల్) ఏర్పాటు చేశారు. రాష్ట్రానికి దాదాపు 400 ల్యాబ్‌లు దక్కాయి. 2024-25 బడ్జెట్‌లో వాటికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. 2025-26 రూ.500 కోట్లు కేటాయించారు. అలానే ఈసారి రూ.3,200 కోట్లు కేటాయించడం విశేషం. ఆ ప్రకారం 30 వేల ల్యాబ్‌లు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. రాష్ట్రానికి వందల సంఖ్యలోనే ఇవి దక్కనున్నాయి. దేశవ్యాప్తంగా స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్)లో సుమారు 45 శాతం మంది అమ్మాయిలున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లాలో వీరి కోసం ఒక గర్ల్స్ హాస్టల్ నిర్మిస్తామని కేంద్రం ప్రకటించింది. వీటిని కలిపి రాష్ట్రానికి 33 హాస్టళ్లు రానున్నాయి.

**ఆవిష్కరణలకు ఊతం :** పరిశోధనలు, ఆవిష్కరణల అంశాలను కేంద్ర ఆర్థిక మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీంతో హెచ్‌సీయూ, ఓయూ, జేఎన్‌టీయూ ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రయోగశాలల్లో కొనసాగుతున్న పరిశోధనలు మరింత వేగమందుకోనున్నాయి. ఓయూ, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు వర్సిటీ, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూలకు రూసా (ఆర్‌యూఎస్‌ఏ - రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ ) నిధులు పెరగనున్నాయి. గతేడాది రూ.232 కోట్లు మంజూరు కాగా ఈ బడ్జెట్‌లో రూ.320 కోట్లు వచ్చే అవకాశాలున్నాయి.

**సర్కారు బడులకు పీఎంశ్రీ :** గ్రేటర్‌లో ప్రభుత్వ పాఠశాలకు పీఎంశ్రీ పథకం ద్వారా ప్రయోజనం లభించనుంది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో వందకుపైగా పాఠశాలలకు ఈ పథకం కింద అదనంగా నిధులు రానున్నాయి. సమగ్ర శిక్షా అభియాన్ కోసం ఈ బడ్జెట్‌లో 10 శాతం నిధులు ఎక్కువగా కేటాయించడం కూడా దీనికి కలిసొచ్చే అంశం.

**సదుపాయాలు :** బాలికా విద్యకు భరోసానిచ్చేలా బడ్జెట్ కేటాయింపు చేశారు. యాదాద్రి, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో సాంకేతిక విద్యకు సంబంధించి జిల్లాకో బాలికా వసతిగృహం అందుబాటులోకి రానుంది. దాదాపు 2,879 ఉన్నత పాఠశాలల్లో ఎంపికైన వాటిలో కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు ఏర్పాటు కానున్నాయి. క్రీడాకారుల కోసం మౌలిక వసతులు దరిచేరను న్నాయి.దీర్ఘకాలిక, అరుదైన రోగాలు క్యాన్సర్, మధుమేహంతో బాధపడుతున్న వారి చికిత్సకు అవసరమయ్యే 17 రకాల ఔషధాలపై బేసిక్ కస్టమ్ డ్యూటీ తొలగింపుతో వాటి ధరలు తగ్గనున్నాయి. దీంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈ ఔషధాలను కొనుగోలు చేసే 45 వేల క్యాన్సర్, 1.34 లక్షల మంది మధుమేహ వ్యాధిగ్రస్థులకు ఊరట కలగనుంది. మూడు జిల్లా ఆసుపత్రుల్లో అత్యవసర, ట్రామాకేర్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.1,782 గ్రామ పంచాయ తీలకు 16వ ఆర్థిక సంఘం నిధులు అందనున్నాయి. ఉపాధి పథకంలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు దక్కనున్నాయి. దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా, పరిశ్రమలకు సంబంధించి అనుకూల శిక్షణ అందించి వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నాణ్యమైన సహాయక పరికరాలను సకాలంలో అందుబాటులోకి తీసుకురానున్నారు. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలో1.50 లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం చేకూరనుంది.సూక్ష్మతరహా పరిశ్రమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రూ.10 వేల కోట్ల బడ్జెట్ కేటాయింపు చేశారు. ప్రస్తుతం వాటికి, కొత్తగా నెలకొల్పాలనుకునే వారికి ప్రయోజనం చేకూరనుంది. వస్త్ర పరిశ్రమకు పెద్దపీటనిచ్చేలా కేటాయించిన బడ్జెట్‌తో ఈ ఉమ్మడి జిల్లాలోని చేనేత రంగానికి నూతన జవసత్వాలు రానున్నాయి.ప్రముఖ పర్యాటక స్థలాల్లో గైడ్‌ల నైపుణ్యాభివృద్ధి పెంపునకు శ్రీకారం చుట్టేలా కార్యక్రమం రూపొందించడంతో నాగార్జునకొండ పరిధిలోని గైడ్‌లకు ప్రయోజనం చేకూరనుంది.

# యూపీ అసెంబ్లీలో 'కర్ణాటక స్పీకర్ సింహాసనం'

కర్ణాటక సభలో కుర్చీని చూసి మనసుపడ్డ యూపీ స్పీకర్

స్వల్ప మార్పులతో సేమ్ కుర్చీని తయారు చేసిచ్చిన కళాకారుడు

కుర్చీ కోసం సుమారు 30 లక్షల ఖర్చు చేసిన యూపీ ప్రభుత్వం

కర్ణాటక అసెంబ్లీలో స్పీకర్ కుర్చీని చూసి మనసుపడ్డ ఉత్తరప్రదేశ్ స్పీకర్ సతీశ్ మహానా దాదాపు రూ.30 లక్షలు ఖర్చు చేసి అలాంటి కుర్చీనే తయారుచేయించుకున్నారు. సతీశ్ మహానా కోరిక మేరకు కర్ణాటక స్పీకర్ ఖాదర్.. తన కుర్చీని పోలిన కుర్చీ తయారీకి కళాకారులను పురమాయించారు. పదిమంది కళాకారులు దాదాపు 2 నెలల పాటు శ్రమించి ఈ కుర్చీని తయారు చేశారు. ఇప్పటికే ఈ కుర్చీని ఉత్తర్‌ప్రదేశ్ కు పంపించినట్లు.. ఆ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందు ఫిబ్రవరి 5 నాటికి అక్కడికి చేరుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో ప్రస్తుతం ఇటు కర్ణాటకలో, అటు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలలో ఒకే తరహా కుర్చీలు ఉండనున్నాయి. వివరాల్లోకి వెళితే..గతేడాది కర్ణాటకలో జరిగిన కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సు కోసం ఉత్తరప్రదేశ్ స్పీకర్ సతీశ్ మహానా బెంగళూరుకు వచ్చారు. ఆ సమయంలో సభలో స్పీకర్ కుర్చీ ఆయనను బాగా ఆకట్టుకుంది. ఆ కుర్చీని తయారుచేసిన కళాకారుడి గురించి ఖాదర్ ను ఆరా తీశారు. యూపీ సభలోనూ ఇలాంటి కుర్చీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. దీంతో మైసూరుకు చెందిన కళాకారులను ఖాదర్ ఆయనకు పరిచయం చేశారు. ఆ తర్వాత చిన్న డిజైన్ మార్పులతో కర్ణాటక కుర్చీ నమూనా ఆధారంగానే కొత్త కుర్చీ తయారీకి ఏర్పాట్లు జరిగాయి.

## కుర్చీ ప్రత్యేకతలు ఇవే..

రోజ్‌వుడ్‌తో తయారు చేసిన ఈ కుర్చీ.. 7.5 అడుగుల ఎత్తు, 4 అడుగుల వెడల్పు ఉంటుంది. కుర్చీపైన గొడుగు లాంటి ఆకారం ఉంది. ఆర్మ్‌రెస్ట్ భాగంలో సింహం, ఏనుగు బొమ్మలు కళాత్మకంగా చెక్కారు. దానిపైన ఉత్తరప్రదేశ్ రాజముద్ర ఏర్పాటు చేశారు. సీటు భాగాన్ని లెదర్తో చేసినట్లు కళాకారుడు కైజర్ అలీ ఖాన్ తెలిపారు.



# ఏపీలో బుల్లెట్ రైళ్ల పరుగులు

మూడు కీలక బుల్లెట్ రైల్ కారిడార్లను నిర్మించనున్నట్లు ఆర్థికమంత్రి నిర్మల వెల్లడి

ఏపీలో పరుగులు పెట్టనున్న బుల్లెట్ రైళ్లు

11 జిల్లాల మీదుగా మూడు కారిడార్లు, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలకు వేగంగా

రాకపోకలు సాగించేలా మూడు కీలక బుల్లెట్ రైల్ కారిడార్ల నిర్మాణం



ఏపీలో నలువైపులా బుల్లెట్ రైళ్లు శరవేగంగా పరుగులు పెట్టనున్నాయి. పొరుగున ఉన్నటువంటి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలకు అత్యంత వేగంగా రాకపోకలను సాగించే విధంగా మూడు కీలక బుల్లెట్ రైల్ కారిడార్లను నిర్మించనున్నారు. ఇవి రాష్ట్ర అభివృద్ధికి కీలక మైలురాళ్లుగా నిలవనున్నాయి. దేశంలోని వివిధ నగరాల మధ్య ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా ప్రకటించారు.

**ఏపీకి హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్:** ఏపీ మీదుగా వెళ్లే హైదరాబాద్-అమరావతి-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, చెన్నై-బెంగళూరు కారిడార్లు ఉన్నాయి. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలలో కలిపి మొత్తం 1,671 కి.మీ. మేర నిర్మించే ఈ కారిడార్లలో అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లోనే 857 కి.మీ. ఉంటుంది. దేశంలో మరే రాష్ట్రానికి ఈ స్థాయిలో హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్ ప్రతిపాదన అనేది లేకపోవడం గమనార్హం. ఇవి మన రాష్ట్రంలోని ప్రధానంగా 11 జిల్లాల మీదుగా వెళ్తాయి. ఈ కారిడార్లతో విజయవాడ నుంచి విశాఖ వైపు మినహా మిగిలిన దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలకు హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్ వచ్చినట్లు అవుతుంది.

**రాయలసీమ జిల్లాల మీదుగా హైదరాబాద్-బెంగళూరు కారిడార్:** హైదరాబాద్-బెంగళూరు కారిడార్ కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా వెళ్తుంది. ఇందులో కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, కియా కార్ల పరిశ్రమకు సమీపంలోని దుద్దేబండ, హిందూపురంలలో స్టేషన్లను నిర్మిస్తారు. ఈ లైన్ తెలంగాణ, ఏపీ, కర్ణాటకలో కలిపి మొత్తం 605 కి.మీ. మేర నిర్మించనున్నారు. ఒక్క ఏపీలోనే 263 కిలోమీటర్లుగా ఉండనుంది. ఈ ప్రాజెక్ట్‌కు రూ.1.51 లక్షల కోట్లు వ్యయమవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. దీనికోసం ఏపీలోని 988.62 హెక్టార్ల భూమి, 4.21 హెక్టార్ల అటవీ భూమి సేకరించాల్సి ఉంటుంది.

**చిత్తూరు జిల్లా మీదుగా చెన్నై-బెంగళూరు లైన్:** చెన్నై-బెంగళూరు మధ్య 306 కి.మీ. మేర హైస్పీడ్ రైల్ కారిడార్‌ను నిర్మించనున్నారు. ఇందులో ఏపీలోని చిత్తూరు జిల్లాల్లో సుమారు 90 కిలోమీటర్లు ఉండనుంది. దీని ఎలైన్‌మెంట్ ఇంకా ఖరారు కావాల్సి ఉంది. ప్రస్తుతానికి చిత్తూరులో రైల్వే స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదించారు. మరో స్టేషన్ కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ కారిడార్ నిర్మాణానికి ఎంత వ్యయమవుతుంది? ఎంత భూమి అవసరం అనే వివరాలతో డీపీఆర్ తయారవుతోంది. కారిడార్‌ను తిరుపతి మీదుగా కూడా వెళ్లేలా చూడాలని సీఎం చంద్రబాబు రైల్వేను కోరారు. ఈ ప్రతిపాదన ఇంకా పరిశీలనలో ఉంది.

**ఏ నగరానికైనా 1-2 గంటల్లోనే ప్రయాణం:** హైస్పీడ్ రైల్ కారిడార్ పూర్తయితే వాటిపై బుల్లెట్ రైళ్లు గంటకు గరిష్ఠంగా 320 కిలోమీటర్ల వేగంతో పరుగులు పెడతాయి. అమరావతి నుంచి హైదరాబాద్‌కు గంటలోపే చేరుకోవచ్చు. అలాగే అమరావతి నుంచి తిరుపతి, చెన్నైలకు రెండు గంటల్లోపు చేరుకునే అవకాశం ఉంటుంది. హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌లో కర్నూలు, అనంతపురం నుంచి ఇటు హైదరాబాద్‌కు కానీ, అటు బెంగళూరుకు కానీ గంటలోపు ప్రయాణంతో చేరుకోవచ్చు. చెన్నై-బెంగళూరు కారిడార్‌లో చిత్తూరు నుంచి ఇటు చెన్నై కానీ, అటు బెంగళూరు కానీ కేవలం అరగంటలో చేరుకునే అవకాశం ఉంటుంది.

**రాజధాని అమరావతి మీదుగా:** హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ అమరావతి మీదుగా, కొత్తగా నిర్మించనున్న విమానాశ్రయానికి సమీపం నుంచి వెళ్లనుంది. దీనిని తెలంగాణ, ఏపీ, తమిళనాడుల్లో కలిపి మొత్తం 760 కిలోమీటర్ల మేర నిర్మించనుండగా, ఇందులో ఏపీలో 504 కిలోమీటర్లు ఉంటుంది. ఏపీలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల మీదుగా ఇది వెళ్తుంది.అంతేకాకుండా దాచేపల్లి, అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి వద్ద సైతం స్టేషన్లను నిర్మిస్తారు. ఈ ప్రాజెక్ట్‌కు రూ.1.90 లక్షల కోట్లు వ్యయమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కారిడార్, ఇందులోని స్టేషన్లకు కలిపి మొత్తం 1,873.7 హెక్టార్ల భూమి అవసరం పడుతుంది. మరో 90.31 హెక్టార్ల అటవీ భూమినీ సేకరించాల్సి ఉంటుంది.

# జనం ముంగిట జల సిరి

జల జీవన్ మిషన్ గడువు పెంపుతో రాష్ట్రానికి ఊరట

18 నెలలుగా జేజేఎం కార్యక్రమాన్ని గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వం



జల జీవన్ మిషన్(జేజేఎం) కార్యక్రమం అమలు గడువు 2028 వరకు పొడిగించడంతో రాష్ట్రంలో వివిధ దశల్లో ఉన్న పెండింగ్ తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి మార్గం సుగమం కానుంది. వీటికి కేంద్రం వాటా నిధులు రాబట్టే అవకాశం కూడా కలిగింది. నదులు, జలాశయాల నుంచి నీరు సేకరించి ప్రజలకు అందించేలా రూ.70 వేల కోట్ల అంచనాలతో ప్రతిపాదించిన పనులను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే కేంద్ర ఆమోదానికి పంపింది. ఈ ప్రయత్నాలు కూడా కొలిక్కి రానున్నాయి.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జల జీవన్ మిషన్‌కు రాష్ట్ర వాటా నిధులు సమకూర్చకుండా ఈ కార్యక్రమాన్ని భ్రష్టుపట్టించింది. కేంద్రం అప్పట్లో రాష్ట్రంలో సుమారు రూ.27 వేల కోట్ల పనులకు అనుమతులిచ్చినా, ఐదు సంవత్సరాల వ్యవధిలో గత ప్రభుత్వం కేవలం రూ.4 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయగలిగింది. రాష్ట్ర వాటా నిధులివ్వని కారణంగా మిగిలిన పనులన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయి. రాష్ట్ర వాటా నిధులు సరిగా కేటాయించకపోగా, కేంద్ర నిధులనూ ఇతర అవసరాలకు వాడేసుకుంది. దీంతో రాష్ట్రంలో 64.78 లక్షలకు పైగా ఇళ్లకు కుళాయిల ద్వారా 2024 నాటికి తాగునీటి సౌకర్యం కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. ఇచ్చిన కొద్దిపాటి కుళాయిల ద్వారా నీరు సరిగా సరఫరా చేయలేకపోయింది.

**ఫలితాలిచ్చిన సంప్రదింపులు :** గత 18 నెలలుగా జల జీవన్ మిషన్ కార్యక్రమాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. ఇందుకోసం 40 వేల పాత పనులను రద్దు చేసి, కొత్త పనులు ప్రతిపాదించింది. 2024 మార్చి తరువాత పథకంలో కొత్త పనులకు, సవరించిన పనులకు కేంద్రం అనుమతులు నిలిపివేసింది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని ఒప్పించి, నిధులు మంజూరు చేయించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. బోర్ల నుంచి కాకుండా నేరుగా జలాశయాల నుంచి నీరు సేకరించి అన్ని సీజన్లలోనూ ప్రజలకు నిరంతరం తాగునీరు అందించేలా దాదాపు రూ.84,500 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లు కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపింది.కేంద్ర జల్‌శక్తి మంత్రిని దిల్లీలో కలిసి పథకం పునర్వ్యవస్థీకరణ ప్రాధాన్యం వివరించారు. 2024-25వ సంవత్సరంతో ముగిసిన జేజేఎం(జల జీవన్ మిషన్) గడువు పెంచాలని కూడా కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈలోగా కేంద్రం మొదట అనుమతించిన సుమారు రూ.27 వేల కోట్ల ప్రాజెక్టులను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జేజేఎం(జల జీవన్ మిషన్) గడువు 2028వ సంవత్సరం వరకు పొడిగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ఆదివారం(01-02-26) ప్రకటించడం రాష్ట్రానికి ఊరట కలిగించింది.

**పనుల పూర్తికి ప్రణాళికలు :** పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.23 వేల కోట్ల ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా కేంద్రం వాటా కింద రాష్ట్రానికి 50 శాతం వరకు నిధులు రానున్నాయి. రాష్ట్ర వాటా నిధుల కోసం జాతీయ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంకు నుంచి ప్రభుత్వం రూ.10 వేల కోట్ల వరకు రుణం తీసుకుంటోంది. దానికి మరో రూ.3 వేల కోట్లు కలిపి మొత్తం దాదాపు రూ.13 వేల కోట్లు తీసుకోవాలని ఇటీవల నిర్ణయించింది. 2028వ సంవత్సరంలోగా పెండింగ్ పనులు పూర్తి చేయించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు అందించనున్నారు.

**2028 నాటికి 95.53 లక్షల ఇళ్లకు రక్షిత నీరు :** రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకంలో ప్రతిపాదించిన పనులన్నీ పూర్తి చేస్తే 2028 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు మాత్రం శాశ్వత పరిష్కారం చూపొచ్చు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దాదాపు 95.53 లక్షల ఇళ్లలో 70.44 లక్షల ఇళ్లకు నేరుగా కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. వచ్చే రెండు సంవత్సరాల్లో మిగిలిన 20.09 లక్షల ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చి మొత్తం 95.53 లక్షల కుళాయిల ద్వారా రోజూ నీరందించనున్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com